# బావి

సిఎచ్. మధు

ఆదివారం.
ఎండకాలం
మిట్ట మధ్యాహ్నం
ఊరు పేరు లక్ష్మీపురం

ఊరుకు పేరుకు సంబంధమేమిటి?— ఆ ఊరులో వున్న చిన్న రచయిత ఒక సారి అంటాడు. "గ్రామంలోని పది ఇళ్ళను వేరుచేసి దానికి లక్ష్మీపురమని— మిగుతా నాలుగు వందలు వేరుచేసి 'బీదలవాడ' అనాలని"—

మిట్ట మధ్యాహ్నం
ఎండకాలం
ఆవేళ —

ఊరుకు రోడ్డు పక్కన చెట్లక్రింద చాలా జనం కూర్చున్నారు. ఒక చెట్టు క్రింద కొందరు. మరో చెట్టుక్రింద కొందరు. ఇంకో చెట్టుక్రింద కొందరు.

ఒక చెట్టుక్రింద కూర్చున్న వారిలో హరిజనులుంటే— ఇంకో చెట్టు క్రింద కూర్చున్న వారిలో అన్నికులాల వారున్నారు. మరో చెట్టు నీడన హరిజన యువకులు నలుగురు కూర్చున్నారు. వాంతోబాటు హరిజన యువజన సంఘ సభ్యులు కూడా కూర్చున్నారు. చిన్న రచయిత కూడా వున్నాడు. అయితే ఆయన 'హరిజనుడు' కాదు

'నాది ఏకులంకాదు' ఆయన అంటూవుండగా ఆయన కులంతో మనకెందుకూ?—

మొత్తం మీద అందరూ మాట్లాడుకుంటున్నారు.

మొత్తంమీద అందరూ మినిష్టర్ సీతారాం కోసం ఎదిరి చూస్తున్నారు.

(సీతారామయ్య మినిష్టర్ అయిన తర్వాత సీతారాం అయ్యాడు)

సీతారామయ్య మంత్రి. హరిజన సంక్షేమ మంత్రి.

అనాడు వస్తానని ప్రజలకు కబురు పెట్టాడు.

స్వాగత తోరణాలు మాత్రం లేవుకాని జనం ఎదిరి చూపులున్నాయి.

సీతారామయ్యది అదే ఊరు ఆ ఊరులోనే పుట్టిపెరిగాడు. అదే నియోజక వర్గం నుండి ఎం. ఎల్. ఏ కు పోటీచేసి— అగ్రకులం వ్యక్తిని అంటే రావును ఓడించి గెలుపొందిన వ్యక్తి.

చాలా సార్లు ఆయన వచ్చి వెళుతుంటాడు. ఎవరూ పట్టించుకోరు. ఆయనతో అవసరమున్న వారుతప్ప.

చెట్టుక్రింద కూర్చున్న హరిజన యువకులముందు ఒక ప్రశ్న వేశాడు రచయిత "రాజీ అనేది ఉందా? సంఘర్షణ కొనసాగిద్దామా?" అని కొంత సేపాగి "ప్రసాద్! మినిష్టర్ వస్తున్నాడంటే రాజీకోసమే సంఘర్షణ కొనసాగిద్దామని ఆయన మనసులో ఉంటే ఆయన రావల్సిన అవసరం లేదు"

భాస్కర్‌బాబూ! మనకీ పంచాయితీతో అవసరమేమిటి?

"అవసరం లేదు. నిజమే. మనవాళ్ళు పెద్దలున్నారు. వాళ్ళనూ, మనలాంటి శ్రమజీవులు ఇతర కులాలతో వున్నారు వాళ్ళనూ మనవెంట లాక్కు పోవల్సిన అవసరముంది. వారిని విడిచి పెట్టవద్దు''

కొంత సేపు చర్చించుకున్నారు. తర్వాత ప్రసాద్‌లేచి తన పెద్దలున్న హరిజనులు కూర్చున్న చెట్టుక్రింద కొచ్చి గుబురు మీసాలు, తలపాగా, చేతిలో చుట్ట, ప్రక్కను కట్టెతో పది మంది మధ్యన కూర్చున్న తాత వంక చూచి (తాత పేరు రామయ్య హరిజన వాడకు పెద్ద మనిషి' అని పిలుస్తారు)

"ఇదిగో మేము కుర్రకుంకలమని మామాట కొట్టిపారవేయద్దు మీకాలానికి మా కాలానికి చాలా తేడా వచ్చింది. మీరు పంచెకడితే మేము ప్యాంటు వేసుకుంటున్నాం మీరు చదువుకోకపోతే మేము చదువుకుంటున్నాం మేము పట్నంలో చదువటానికెళితే మమ్మల మాదిగ వారిగా ఎవ్వరూ చూడరు. ఇక్కడికి వస్తే– మాదిగ వాళ్ళగా, అంటరాని వాళ్ళగా– మాకిది నచ్చదు. జరిగిన రక్తపాతమేదో జరిగింది. దానికి ప్రతిక్రియ కావాలి. మంత్రి మన వాడు కావచ్చు మన కులం కావచ్చు. మన ఊరు కావచ్చు. కాని ఈనాడు కారులో తిరుగుతున్నాడు. మేడలో ఉంటున్నాడు. మన బ్రతుకును మర్చిపోయిన ఆయన మనకు న్యాయం చేస్తాడనే నమ్మకం లేదు. ఏమైనా రాజీ, ఏదోపోనీ– అంటే మేము సహించము." అంటూ వెళ్ళిపోయాడు.

అందరూ వెళ్ళిన దిక్కే చూస్తున్నారు
''పిచ్చి నాయళ్ళు'' అన్నాడు రామయ్య
''వాడనేది నిజమే" అన్నాడు వెంకయ్య

ప్రసాద్ పట్నంలో చదువుకుంటున్నా ఊరి సమస్యలతో చాలా సంబంధాలున్న వ్యక్తి. వేసవి సెలవులకు ఇంటి వద్దే వుంటున్నాడు.

ఈ ఊరికి మంత్రి రావాటనికి, ఒక సంఘర్షణకు వెనుక చాలా కారణా లున్నాయి.

ఊరు అంత పెద్దదీకాదు. పూర్తిగా చిన్నదీకాదు. ఐదు వందల ఇళ్ళపైనే వుంటాయి. మూడువేల పైన జనాభా ఇందులో హరిజనులవి ఎనబది ఇల్లు. ఆరు వందల జనాభా దాటేవుంటుంది.

ప్రసాద్ హరిజనుడే కాని హరిజనుల విషయంలో కొన్ని అభిప్రాయాలంటూ ఆయనకున్నాయి.

స్వాతంత్ర్యం రాకముందు హరిజనులను అంటరాని విధంగాఏ విధంగా పరిగణించారో–తర్వాత–కొన్ని ఏళ్ళ వరకు పెద్దమార్పు అంటూ రాలేదు. "మార్పురావాలి మార్పురావాలి అందరమూ ఒకటే" అనే ఉపన్యాసాలు వినాదాలు పెరుగటం తప్ప పెద్ద మార్పంటూ రాలేదు. పెద్ద మార్పు వస్తుందనే ఆశకూడా కనుచూపు మేరలో ఆయనకు కనిపించ లేదు. ఎందుకంటే అగ్రవర్ణాల వైఖరి ఒక కారణమైతే, ఇంకో కారణం తక్కువ జాతి వర్ణాలు కూడా తనతోపాటు శ్రమజీవులైన హరిజనులను అంట రాని వారిగానే చూశారు.

ఆ విషయాన్నే ఆ ఊరు రచయిత ఒకసారి రాస్తాడు. "స్వాతంత్ర్యం" వచ్చి ఇరువుది ఏళ్ళు అయిపోయినా హరిజనులు మనవాళ్ళే అనే వైఖరి ఎక్కడా రాలేదు. పట్నాలలో ఏదోకల్పి తిరిగే మార్పు వచ్చినా– పల్లెల్లో అది కూడా రాలేదు. ముఖ్యంగా అగ్రవర్ణాల ఆలోచనల్లో ఈ మార్పు ఎక్కడా రాలేదు. అయితే పోయిన తరం అంట రాని వారిగా పరిగణిస్తే అలవాటు పడిన తరం రాజీగా ఒప్పుకుంటుంది కాని కొత్తతరం స్వాతంత్ర్యానంతరం జన్మించిన తరం ఈ అసహ్యాకరమైన అంటరాని తనాన్ని ఒప్పు కొనటం లేదు"

ముఖ్యంగా ప్రసాద్‌కు ఈపల్లెలోని పరిస్థితులు ఇషంకావటంలేదు. పట్నాలలో ఒక మార్పు వచ్చింది. హరిజనులెవరో అగ్రవర్ణాలవారెవరో గుర్తించటానికి వీలు లేని పరిస్థితులు వచ్చాయి. కాలేజీ, బస్సు, రైలు, ఉద్యోగాలలో కల్పి జీవిస్తున్నారు. అట్లా జీవించినా "వీడు మాలవాడు" అంతే చిన్నచూపు గమనించాడు ప్రసాద్. అంతే కాదు ఇంకోవిషయం గమనించాడు ఉన్నవారు లేనివారిని అంటరానివారుగా, తెలివి తక్కువ వారిగా నీచంగా హీనంగా చూడటం, ఒక ఆశ్చర్యకరమైన విషయం. ఇది ప్రసాద్‌కు ప్రశ్నగా మిగిలిపోయినా– రచయిత స్నేహం తర్వాత చాలా ప్రశ్నలకు

జవాబు దొరుకుతూ వుంది. ఉన్నవారు లేనివారిని నీచంగా చూస్తే లేనివారుకూడా వారిలో ఒక భాగమైన హరిజనులను ఎందుకు నీచంగా చూస్తారు? వాళ్లు వీళ్లు ఎందుకు కల్సిపోరు? ఈ ప్రశ్న చాలా కాలంనుండి ఆయన మనసులో మెదులుతూనే వుంది. దీనికి జవాబు రచయిత చెప్పాడు "ఈ ప్రపంచములో కులాలు రెండు మాత్రమేనని, ఉన్నవాళ్లు, లేనివాళ్లు, ఉన్నవాళ్లు వాళ్ళ క్షేమంకోసం లేనివాళ్ళలో ఈ విభజన కల్పించారని," దీనిలో ప్రసాదుకు అన్ని జవాబులు దొరికాయి. అంతేకాదు ఒక విశ్వాసం కూడా ఆయనకు కలిగింది. ఒకనాడు కుల, మత బేధాలు లేకుండా లేనివారంతా కల్సిపోతారని.

పట్నముకు చదువుకోసం వెళ్తున్నాడు వస్తున్నాడు. కాని ఈ పల్లెకు వచ్చినపుడెల్లా పెద్ద బాధగా వుంది. పట్నంలో తనను మాలవానిగా ఎవరూ గమనించరు. కాని తన పల్లెకొస్తే తనో అంటరానివాడు. పల్లెలలోని పరిస్థితులు ఆయనకు చాలా బాధ కలిగించేవి. ఊరి హోటళ్ళలో మాల మాదిగలు త్రాగటానికి బయట ఒకగ్లాసు అది వాళ్ళే కడుక్కోవాలి. అది హరిజనుల గ్లాసు. ఈ మాలవాళ్ళు ఎవరింటికైనా వెళితే బయట కూచోవాలి. దూరంగా నిల్చొని మాట్లాడాలి. వాళ్ళ బావి. నీళ్లు ముట్టుకోకూడదు. ఎవరైనా నీళ్లు ఎత్తుకరాగా పొరబాటున మాలవాళ్ళు తగులుతే ఆ నీళ్ళు పారపోయటం ప్రసాద్‌కు బాధగా దుఃఖంగా ఉండేది ముఖ్యంగా హరిజనులందరిని అగ్రవర్ణాలు 'అరేయ్' అని పిలువటం, నీచంగా తిట్టటం ఆడవాళ్ళను 'ఏమే' 'ఒసే' అనటం ఇంకాపోతే ఒక్కొకసారి 'లంజా' అంటూ హీనంగా తిట్టడం బాధ, కోపం కల్గించేవి.

వీటన్నిటికి ఎప్పుడైతే జవాబు దొరికిందో రచయిత అండదండలు దొరికాయో– ప్రసాద్ ముందు ముందు అవసరమనుకొని తనలాంటి యువకులతో 'ఒక గ్రూపు' అంటూ ఏర్పాటు చేసుకోసాగాడు.

## 3

ఒకనాడు ప్రసాద్ పల్లెలోని హోటల్‌కెళ్లాడు. అది గుడిసె. లోపల కూర్చోవటానికి ఒక చాప పరిచివుంది.

ప్రసాద్ అన్న టీ త్రాగటానికి బయట కూర్చున్నాడు. ఆ హోటల్ ఒక కాపుది. వాడు టీ గ్లాసులో తెచ్చి 'ఏమిరా నీ గ్లాసు పట్టురా' అనగానే గుడిసెచూరులో చెక్కివున్న మాలవాళ్ళ గ్లాసు తీసి పట్టాడు. అందులో పోశాడు. ఇదంతా ప్రసాద్

చూస్తూనే వున్నాడు. తనవాళ్లు త్రాగిపెట్టిన గ్లాసు– దాన్ని కడిగారో లేదో. లోపలెందరో టీ తాగుతున్నారు. బయట మాలవాని గ్లాసు. మాలవాని టీ.

గాంధీజీ సాధించిన స్వాతంత్ర్యములో ఇది హరిజనుని గతి.

కోపమొచ్చింది ప్రసాద్‌కు. అన్న చేతిలోని గ్లాసును విసిరికొట్టాడు. కాపును బయటకు లాగి "ఇట్లా మావాళ్ళకు బయట టీ పోస్తే చంపేస్తాను" అంటూ నాలుగు తన్నాడు.

అందరూ ఆశ్చర్యపోయారు

ఊరిలో సంచలనం చెలరేగింది

పెద్దలందరూ ఆలోచించి ప్రసాద్‌ను ఆరాత్రి జైలుకు పంపించారు.

మాలమాదిగలంతా కల్సి ఈనాటి మంత్రి సీతారామయ్య (ఆనాడు అధ్యక్షుడు) కాళ్ళు పట్టుకొని ప్రసాద్‌ను విడిపించుకున్నారు.

అగ్రవర్ణాలను ఒప్పించి కేసు పెట్టించకుండా ఆపు చేయించాడు సీతారామయ్య.

బయటకొచ్చిన ప్రసాద్‌తో "ఆ అయ్య లేకపోతే నువ్వు జైలులో ఉండేవాడివి గదరా! నీమీద కేసు నడిచేది" అంటే "అయ్యా నీకు తెలియదు. మనమీద ఆయనకు అభిమానముంటే– అట్లా గ్లాసు బయటపెట్టి మనకు టీ ఇస్తున్నందుకు వానిమీదే కేసు పెట్టించేవాడు" అన్నాడు ప్రసాద్.

ఇంత పెద్ద గందరగోళం జరిగినా–

తర్వాత

మార్పేమీ లేదు.

అదే గ్లాసు– అక్కడే–

గుడిసె ముందు కూర్చుని మళ్ళీ టీ త్రాగుతున్నారు.

## 4

ఆ తర్వాత కొన్ని రోజులకు ఒక మిట్ట మధ్యాహ్నం "ఈ ఊరిదొర నన్ను పొలములో చెరిచాడురో వానిపైకక్ష తీర్చుకోకపోతే నేనీరాత్రి చస్తానురో" మాలవాడంతా తిరుగుతూ అరిచింది మామిడికాయలాంటి యువతి. ఆమెకింకా పెళ్లికాలేదు.



ఆమె పేరు సీత.

ఆమె అంటున్నది నిజమే.

ఆమె పొలములో పనిచేస్తూ ఉండగా దొర వచ్చి దాని అందాన్ని చూసి, మురిసి, పట్టి, అది రక్కినా కొరికినా ఎదిరించినా అరిచినా ఆ మక్కజొన్న చేనులో జొన్న మువ్వలాంటి సీతను నలిపేశాడు.

ఆమె తర్వాత— అట్లాగే చిరిగిన రవికెతో ఊడిపోయిన కొంగుతో 'వానిపై కక్ష తీర్చుకొమ్మంటూ' మాలవీధి అంతా తిరిగింది.

అనాడు ప్రసాద్ లేడు.

సీతకు తల్లితండ్రులు లేరు. అన్న ఉన్నాడు కాని ఊళ్ళో లేడు.

ఆమె ప్రేమించే—మేనబావ—బొంబాయిలో పనికోసం వెళ్లాడు.

కక్ష ఎవ్వరూ తీర్చుకోలేదు. ధైర్యం లేదు.

రచయిత వాడకొచ్చి హరిజన పెద్దమనుష్యులను కల్సి "కనీసం దొరను వెళ్లి అడుగుమన్నాడు."

ఎవ్వరూ ధైర్యం చేయలేదు.

ఆ రాత్రి—

సీత ఏమనుకుందో ఏమో?—

బావిలో పడి చనిపోయింది.

తెల్లవారి—

ప్రసాద్ వచ్చాడు. విని— కోపముతో తుఫానులో చెట్టు ఊగినట్లు ఊగిపోయాడు. తన తోటి హరిజనుల నందరిని తిట్టాడు. అసహ్యించుకున్నాడు. మీరు మనుష్యులు కాదన్నాడు. మీలో రక్తమాంసాలు లేవన్నాడు. వట్టి పిరికిపందలన్నాడు. "వాన్ని ఆ దొరను చంపుతాను ఆ ఇల్లుకు నిప్పుపెడుతానంటూ" బయలు దేరాడు.

ఇంట్లో దొర లేడు.

లేకుంటే చంపేవాడే

అందరూ ఆపారు.

లేకుంటే— ఇల్లుకు అగ్గి పెట్టేవాడే.

తెల్లవారి—

పట్నంలో హరిజన సంఘానికి ఉపాధ్యక్షులైన సీతారామయ్య ప్రసాదును, కొందరిని పిలిపించాడు. ఆయన పిలిపించటానికి కారణముంది. నిజంగానే ప్రసాద్ చంపుతాడనే భయంతో— దొర శంకర్‌రెడ్డి ఆయన కాళ్లు పట్టుకున్నాడు.

ప్రసాద్ ఒక మాటన్నాడు సీతారామయ్యతో

"ఇది నాకు అవమానం కాదు. మీకుమీకు– మీరు మాకు ప్రతినిధులు"
నిజమేనంటూ తలూపాడు సీతారామయ్య.

ప్రసాద్ ఇంకోమాట అన్నాడు "ఒకనాడు వానింటికి అదే దొర యింటికి వెళితే "అరేయ్ మాలోడా। బయట ఉండురా ఎక్కడికిరా లోపలికి"– అన్నాడు. ఈనాడు వానికి సిగ్గులేదు ఒకదాన్ని చెరచటానికి. పండటానికి మాదిగది కావాలి, పనిచేయటానికి మాదిగది కావాలి, బావులు త్రవ్వటానికి మాదిగ కావాలి. పొలాలు దున్నటానికి మాదిగ కావాలి. కాని మాదిగవాడు అంటరానివాడు వానికి పరువులేదు. ప్రతిష్టలేదు. వాని శరీరం శరీరం కాదు. వాని ఆడవాళ్లు ఆడవాళ్ళు కారు. వేశ్యలు కదూ। వీడిట్లా ఎందరినో చేసాడు పరువు–ప్రతిష్ట–భయం నోరు నొక్కేసింది. ఇక ఈ దొర ఆటలు మేము సహించం."

ఏమీ అనలేదు సీతారామయ్య. చాలా సేపటి తర్వాత "ఏదో రాజీ చేసుకుందాం రా పర్సాద్"

"ఏ రాజీ అవసరం లేదు"

సీతారామయ్య చెప్పిన ఏ రాజీకి అంగీకరించలేదు. ఒకమాట అన్నాడు ప్రసాద్ "మనకు అన్యాయం జరిగింది, మీరు వేరుకాదు మేము వేరుకాదు. మనమంతా ఒకటి రాజీ అంటూ మాట్లాడటం నాకు ఆశ్చర్యమేస్తుంది."

సీతారామయ్య ఏదో ఆలోచనలో పడ్డాడు. ఇదేదో తనమీద ఒరిగేలా వుంది. ప్లేటు మార్చాడు. "నిజంగానే పర్సాదు పోలీసు కేసు పెట్టుదాం."

అంతలో శంకర్ రెడ్డి వచ్చాడు.

వాన్ని చంపాలనే వుంది ప్రసాద్‌కు– ఎదురుగా సీతారామయ్య.

ప్రసాద్‌తోపాటు ఇద్దరు పెద్దమనుషులు కూడా వచ్చారు. వారేమి మాట్లాడటం లేదు. పర్సాద్ అనేదాంట్లో న్యాయముంది. పెద్దమనుషులకు కూడా దుఃఖముంది. కోపముంది. దానితోపాటు భయముంది.

శంకర్ రెడ్డి ఒక మాటన్నాడు, "నాది తప్పే. మీరంతా క్షమించాలి" ప్రసాద్ తంతాడనే భయమే అనిపించింది.

"తప్పా...... క్షమాపణా...... నీ తల నరికితేనే శాంతి"– అన్నాడు ప్రసాద్.
"కొంచెం శాంతిరా పర్సాద్" సీతారామయ్య ఊరడించాడు.
అందరికీ ఇంట్లో నుండి కాఫీలొచ్చాయి.

తాగారు.

బయట కొచ్చారు.

ప్రసాద్‌కు రెండు విషయాలు మనసులో కొచ్చాయి.

సీతారామయ్యది తన కులం, తనవాళ్లు తన ఊరునుండి వస్తే కింద కూచో బెట్టాడు ఆయన కుర్చీమీద కూర్చున్నాడు. అదే శంకర్ రెడ్డి వస్తే కుర్చీమీద కూర్చోబెట్టాడు.

తన ఊళ్ళో మాలవాడు అంటితే నీళ్ళువాడని ఈ శంకర్ రెడ్డి— సీతారామయ్య కాఫీ యిస్తే తాగాడు—

అప్పుడే తెల్సుకొన్నాడు ప్రసాద్. ఉన్నవాళ్ళంతా ఒకటి— లేనివాళ్ళంతా ఒకటి.

పోలీసుల ద్వారా కేసు పెట్టించాడు.

సాక్ష్యం—

సీత బజారులో అరిచినట్టు—

ఎందరో విన్నట్టు—

ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు—

హరిజనుల నందరినీ ఏకత్రాటికి కట్టేశాడు ప్రసాద్.

ప్రసాద్‌కు డబ్బులేదు పోదగల వ్యక్తుల సహాయం లేదు.

శంకర్ రెడ్డికి డబ్బు — పరువు.

కేసు కొట్టేశారు,

ప్రసాదుకు కోర్టుల మీద నమ్మకం పోయింది. ఆయనకొక విషయం అర్థమయిపోయింది. తనకు న్యాయం దొరుకక పోవటానికి కోర్టు కారణం కాదు. డబ్బు కారణం.

## 5

రచయితనుఊరు ఆ నుండి ట్రాన్స్‌ఫర్ చేసారు. ఆయన ఆ గ్రామములో గవర్నమెంటు టీచర్.

శంకర్ రెడ్డి తనను ట్రాన్స్‌ఫర్ చేయించాడని రచయితకు అర్థమయిపోయింది. తన గ్రామములో హరిజనులు చైతన్యవంతం కావటానికి రచయితే కారణమని—

రచయిత వెళ్తూ ప్రసాద్‌తో ఒకమాట అన్నాడు "నా అవసరం ఇక్కడ తీరిన తర్వాత ట్రాన్స్‌ఫర్ చేయించాడు. ఇంకో ఊళ్ళో నా అవసర ముంది. ఒక మాట

ప్రసాద్. మన వాళ్లంటే – లేనివాళ్ళు – ఎన్నో తప్పులు చేస్తారు. మన దారిలోకి తొందరగా రారు. విసుగొద్దు. వాళ్లకు కోపమొచ్చి – లేచిన నాడు వాళ్లముందు నడుస్తారు. మనమే వెనుక అవుతాం. మొత్తంమీద ఈసమాజం సంస్కరణల్తో మారదు ఈవిషయమే వాళ్లకు నేర్పితే – పునాదుల నుండి మార్పులకు వాళ్లు ఉద్యమిస్తారు"

## 6

ఆ ఊళ్ళో అగ్రవర్ణాల మధ్య హరిజనుల మధ్య అపుడపుడు పేచీలు జరుగుతూనే ఉన్నాయి. హరిజనులకు అగ్రవర్ణాలకు మనస్పర్ధలు ఉంటూనే ఉన్నాయి.

## 7

మూడేళ్లు గడిచి పోయాయి. ఎన్నికలొచ్చాయి. పట్నంలో తన గ్రూపు వాళ్ళ ఒత్తిడి మూలంగా – సీతారామయ్యకు ఎం. ఎల్. ఏ.కు పార్టీ టిక్కట్టు దొరికింది. ఒక 'రెడ్డి' ఆయనకు పోటీగా నిల్చున్నాడు.

సీతారామయ్యకు ప్రసాద్ బలంతెల్సు. ఆయనకు ఊళ్ళో కొందరు యువకు లున్నారు. కాలేజీలో ఒక గ్రూపుంది. అందుకే ప్రసాద్‌ను పిల్చి తనదిక్కు ప్రచారం చేయుమన్నాడు.

ప్రసాద్ చాలా ఆలోచించి మాట్లాడాడు

"సీతారామన్నా. నేను చాలా విషయాలు ఆలోచిస్తున్నాను. నాకేదోనిజం అర్థం కావటంలేదు. మీరుగెల్చినా – లేనివాళ్ళకు పెద్దగా సహాయం చేస్తారనే ఆశ నాకులేదు. మీమీద విశ్వాసం లేకకాదు. చేయటానికి వీలులేని పరిస్థితులు ఇక్కడున్నాయి. లేని వాళ్ళపేరిట ఏమిచేసినా – ఉన్నవాళ్ళు దక్కించుకునే స్వరూపం ఇక్కడ ఉంది. ఇటువంటి పరిస్థితిలో – ఆత్మనమ్మకొని మీకు ప్రచారం చేయలేను. అయితే – మీరు గెలిస్తే కొంతలో కొంత మంచిదే, మేలు జరుగొచ్చు. అందుకే నావాళ్ళు – ఎవరైనా ప్రచారం చేస్తానంటే – వద్దనను''—

బయట కొచ్చేసాడు ప్రసాద్.

సీతారామయ్య గెలిచాడు. ఉన్నవాడు కాబట్టి కొంత ఖర్చుచేసాడు. పార్టీప్రతిష్ట కొంత – వెనుకబడిన వర్గమంతా – "మనవాడు" – అంటూ అనుకోవటం మూలంగా –

గెల్చిన తర్వాత ఆయనకో గ్రూపుందని. ఇంకొకటి హరిజనుడని—

"మంత్రి" పదవి దొరికింది.

## 8

సీతారామయ్య మంత్రి అయిన తర్వాత— ఊళ్ళో మీటింగ్ చేసి "మనమంతా ఒకటే. మాలమాదిగలు వేరుకాదు. ఈ దేశములో అంతా ఒక్కటే— మాలమాదిగలను హీనంగా చూడటం నేరంగా పరిగణించటం జరుగుతుంది— ఈ హరిజనులు కూడా సర్దుకోవటం మంచిది''— అంటూ— ఈ స్పర్థలు మానుకోవాలంటూ నచ్చచెప్పాడు.

## 9

సీతారామయ్య మంత్రి అయిన తర్వాత లక్ష్మీపురంకు లైట్లువచ్చాయి. బస్సులు పెరిగాయి. స్కూల్లో రెండు తరగతులు పెరిగాయి. భూములులేని హరిజనులకు కొన్ని భూములు లభించాయి. భూముఉన్నవారికి అప్పులు దొరికాయి.

మొత్తంమీద కొంతపని జరిగింది.

పనిలోపని—

దొరలకు ధనవంతులకు కూడా కొన్ని ఫ్యాక్టరీలకు లైసెన్సులు దొరికాయి. వాళ్ళు పెరిగారు.

గెల్చిన రెండేళ్లకు— హరిజనవాడ నిర్మాణం కొరకు లక్ష్మీపురంకు లక్షరూపాయలు మంజూరు చేయించాడు సీతారామయ్య.

అది ఊరికి నాలుగుఫర్లాంగుల దూరం బయట...

ఇక్కడే వచ్చింది పేచి.

"ఊరిలో కట్టించాలి భయమెందుకూ? ఊరికి దూరంగా ఉండాలా?" అంటాడు ప్రసాద్.

ఈ విషయంలో ప్రసాద్ పేచీ లేవదీసాడు.

అంగీకరించలేదు సర్పంచు రెడ్డి

'ఏదో వట్టిగా ఇల్లు రాగా ఈ అల్లరెందుకూ?' అన్నారు మిగతా హరిజనులు.

ప్రసాద్ ఈ విషయంలో సీతారామయ్య వద్దకెళ్ళాడు.

ఆయన మంత్రి—

పట్టించుకోలేదు.

ఊరికి బయట నాల్గు ఫర్లాంగుల దూరములో హరిజనవాడ వెలిసింది.

## 10

ప్రసాద్‌కు లెటర్ రాసాడు రచయిత భాస్కర్‌బాబు.

ప్రసాద్!

హరిజనవాడ విషయంలో ఓడిపోయావు కదూ! ఇది నీవు చాలా దీర్ఘంగా ఆలోచించాల్సిన విషయం. ఏ కట్టుబాటు నుండి ఈ విషయములో హరిజనులంతా వెళ్ళిపోయారు. ఎందుకూ? స్వార్థం ఏదో తమకు లభిస్తుందనే ఆశ 'నాది' అంటూ ఒక ఇల్లు అవుతుందనే ఆశ ఈ 'నాది' అనే ఆశలోనే ఈ వ్యవస్థ పునాదులున్నాయి

—మీ భాస్కర్

ప్రసాద్‌లో ఎన్నో ఆలోచనలు రేపింది లెటర్.

## 11

ఊళ్ళో హరిజనవాడ నిర్మాణంతోపాటు—
ఊళ్ళో ఒక మంచినీటి బావి పెద్దది.
హరిజనవాడలో ఒక మంచినీటి బావి చిన్నది
వెలిశాయి—

## 12

ఈ బావులే తెచ్చాయి చిక్కు
ఎండకాలం

బాగా ఎండలు కొట్టాయి. అంతకు క్రితం సంవత్సరం వర్షాలు కూడా బాగా పడలేదు. అందుకే చెరువులుకూడా తొందరగా ఎండుకపోయాయి. చిన్న చిన్న బావులన్నీ ఎండుకపోయాయి.

హరిజన వాడలోని బావి ఎండుకపోయింది.
అందులో నీళ్లు లేవు
పొద్దున ఊరే నీళ్లు నాల్గు ఇళ్ళకే సరిపోతున్నాయి.
ఊళ్ళో పెద్ద మంచినీటి బావిలో పుష్కలంగా నీళ్లు—
ప్రసాద్ ఆలోచించాడు ఎందుకు తెచ్చుకోకూడదు?

ఆమాటే అన్నాడు. "మనమంతా ఒకటే అని చెప్పారు కదా సీతారామయ్య, ఎందుకు తెచ్చుకోకూడదు నీళ్లులేక చద్దామా? అందరిదీ బావి"

అందరూ తలూపారు.
తెల్లవారే సరికి హరిజనులంతా ఊళ్లో బావి నుండి నీళ్లు తోడుకొని తెచ్చుకున్నారు.
"ఊళ్ళో బావిని మాదిగవాళ్ళు ముట్టుకొన్నారని"

"ఊళ్ళో బావిలో మాలవాళ్ల నీళ్లు చేదుకున్నారని"

"మన గతేమిటీ? వాళ్లు మనం ఒకటే బావిలో చేదుకుందామా?" అందరూ ఇదే ప్రశ్న అగ్రవర్ణాలే కాదు మిగతా సాలె, వడ్రంగి, సాకలి. మంగలి, కాపు అందరూ ఇదే మాట.

అయితే ఈ పేచీ పెరుగటానికి శంకర్‌రెడ్డి కారణం. కొందరేమో ఈ కాలములో ఏమిటీ? త్రాగితే త్రాగనీ అనుకొన్నారుకాని ప్రసాద్ పైన కక్ష తీర్చుకోవాలని, సర్పంచు శంకర్‌రెడ్డి కావాలని ప్రచారం చేయించాడు. అందరినీ రెచ్చగొట్టించాడు.

సర్పంచు హరిజనవాడ పెద్దమనిషిని పిలిపించాడు. హరిజనవాడ పెద్దమనిషికి ఇంతకాలం దొర అంటే భయం కాని ఇప్పుడు భయం పోయింది. రుమాలు చుట్టుకొన్న నెత్తితో, తొడుక్కున్న నిండుచేతులులేని అంగితో, మోకాళ్ళవరకు పంచతో, నోట్లో చుట్టతో— సర్పంచు ముందు నిలుచున్నాడు

సర్పంచు కుర్చీమీద కూర్చున్నాడు.

"ఇవ్వాళ ముట్టారేదో ముట్టారు. అది మాలాంటివాళ్ళ బావి. మాదిగోళ్ళ బావి కాదు రేపు ముట్టితే అందులోనుండి చేదితే— అక్కడ తలలు ఎగురుతాయి"—

"మాకు నీళ్లు"—

"కొత్తబావిని త్రవ్వించుకోండ్రా? లేదా ఆబావిని ఇంకాలోతుగా త్రవ్వించండి".

'పైసలు దొర'—

"మనిషికిన్ని వేసుకోవాలిరా'' మీసం మెలేస్తూ చెప్పాడు.

బయటకొచ్చిన హరిజన పెద్దమనిషి— ప్రసాద్‌తో జరిగిన సంగతంతా చెప్పాడు.

"తలలు ఎగురుతాయా చూద్దాం" అన్నాడు ప్రసాద్.

## 13

గ్రామంలో ఏదో అగ్ని అంటుకునేలా కన్పించసాగింది.

ప్రసాద్ తన తోటి యువకుల నందరినీ సిద్ధం కమ్మన్నాడు.

సర్పంచు కాపువాళ్ళను పిల్చి "ఇది అన్యాయంరా మన బావిని మాలవాళ్లు ముట్టుకుంటే మనం త్రాగుదామా? రేపు ఏదో ఒకటి తేల్చివేయాలి. ఆ ప్రసాద్ గాడికి కళ్ళు నెత్తికెక్కాయి. వానిపని చేస్తే తప్ప అందరూ దారికిరారు. లేకపోతే మనను ఈ

ఊళ్ళోనుండి వెళ్ళగొట్టి ఊరినే లాక్కుంటారు" సిగరెట్టు ముట్టించాడు. పొగ పీల్చాడు వారికి పొగవేసాడు.

ప్రసాద్ ఆనాడు ఊరంతా తిరిగాడు. వెనుక బడిన వర్గాల వారికంతా చెప్పాడు. "మనమంతా ఒకటి- లేని వాళ్ళమంతా ఒకటి- అల్లరద్దు. మనలో మనకు అల్లరి చేయాలని చూస్తున్నాడు రెడ్డి''— అని చెప్పాడు.

## 14

తెల్లవారింది. ఊరు మధ్య బావి. బావిం దూరంగా గాంధీ విగ్రహం. అటు పక్క పచ్చని వేప చెట్టు

వేప చెట్టుమీద కాకులు అరుస్తున్నాయి.

నాల్గు గంటలకే వచ్చి కాపువాళ్ళు కర్రలతో కాపలా ఉన్నారు.

కర్రలతో బిందెలతో వచ్చాడు ప్రసాద్. ఆయనతోపాటు ఇంకో ఆరుగురు యువకులు

అప్పటికే తెల్లవారబోతుంది.

"బావిలో తాడు వేయద్దురా'' హెచ్చరించాడు కాపుపెద్ద వీరారెడ్డి

"మాకు నీళ్ళు కావాలి వీరారెడ్డి"

బావిలో తాడు వేశాడు.

ప్రసాద్ నెత్తిమీద కర్ర దెబ్బ పడింది. బావిలోని తాడు బావిలోకే పోయింది. తిరిగాడు ప్రసాద్. కర్రతో వేసినవాణ్ని వేసాడు.

సంఘర్షణ ప్రారంభం.

వాళ్లు వీళ్లు కర్రలతో కొట్టుకుంటున్నారు.

కొట్టుకుంటూ గాంధీ విగ్రహం వరకు వెళ్లారు.

కాపు వాళ్లు పదిమంది

హరిజనులు ఆరుగురు

అప్పటికే ఆరుగురికీ దెబ్బలు బాగా తాకాయి. ఒకడు అప్పటికే పడిపోయాడు.

గాంధీ విగ్రహం ముందు మిగతా ఐదుగురు పడి పోయారు.

పడిపోయిన తర్వాత కూడా ఐదుగురిపై కర్రలు నాట్యం చేసాయి.

గాంధీ ముందు రక్తం.

సూర్య కిరణాల తాకిడికి రక్తం మెరుస్తూంది.

## 15

ఈ వార్త జిల్లా అంతా ప్రాకి పోయింది. అందరికీ తెల్సింది.

పోలీసులొచ్చారు.

కొందరిని అరెస్టు చేసి తీసుకెళ్ళారు.

పత్రికలో కెక్కింది.

మంత్రి గారికి తెల్సింది.

తన ఊళ్ళో ఈ కథ... తాను హరిజనుడు తన ఊళ్ళో హరిజనులను కొట్టారు.

తనకెంత అప్రతిష్ట.

తనకేమైనా పరువుంటుందా దేశములో?

"కేసు పెట్టవద్దు. నేను అందరికీ రాజీ కుదుర్చుతాను ఆదివారం వస్తున్నాను." కలెక్టర్‌కు, ఎస్. పి. కి ఫోన్‌లో చెప్పాడు .

ఆదివారం ఇంకా నాలుగు రోజులు

ఆలస్యంగా పోవాలి. కోపాలు చల్లారుతాయి.

ఇదీ పథకం

## 16

ఆదివారం

అందరూ మంత్రి కోసం ఎదిరి చూస్తున్నారు.

అప్పటికి ఆసుపత్రి నుండి విడుదలయి వచ్చారు ప్రసాద్ ఇతరులు.

మంత్రి నాల్గు గంటల కొచ్చాడు

పంచాయితీ బోర్డు చావడిముందు నిల్చుని అందరినీ పిల్చాడు.

అంతాజనం నిల్చున్నారు. పెద్దలంతా కూర్చున్నారు.

అందరూ చెప్పారు. సర్పంచు, కాపు పెద్ద, హరిజన పెద్ద, వాళ్ళ బాధ. జరిగిన కథ.........

అందరు చెప్పింది అల్లరి గూర్చి......

అయితే—

తర్వాత—

తలా ఒక మాట అనుకొన్నారు. మంత్రి మూగిగా ఊరుకున్నారు. మాటలు మాటలు పెరిగాయి. మళ్లీ కొట్టుకునేలా తయారయ్యారు.

ప్రసాద్ ఏమీ మాట్లడటం లేదు. అయనకు తెల్సు ఈ పంచాయితీ తనికేమీ ఒరుగబెట్టదని, ఈ మంత్రి మనవాడైనా వాళ్ళ చేతిలో కీలు బొమ్మని. దీనికి పరిష్కారం ఇదికాదని..... ఇంకా ప్రసాద్ కనుమానంగానే ఉంది. సంఘర్షణ సంఘర్షణతో మూగుస్తుందా?—

ఇంతగా వీళ్ళు మాటలతో అనుకుంటున్నా మినిష్టర్ ఒక్కమాట మాట్లాడలేదు. ఎంతగా మాటలతో అనుకున్నా కొట్టుకోరని మినిష్టరుకు తెల్సు. ఎందుకూ? పోలీసు కీపుంది.

నోరెత్తాడు మినిష్టర్,
"మీరంతా ఊరుకుంటారా"
అంతా నిశ్శబ్దమయ్యింది.

అయితే ప్రసాద్ ఒక మాటన్నాడు "ఈ ఊరంతా ఒక్కటి అస్పృశ్యత పరగణన నేరమనే ఒక చట్టముంది మీకు తెల్సు. చట్టకర్తలే మీరు నేను చెప్పాల్సిందేమీ లేదు. ఊరు అందరిది. బావి అందరిది. మీరు మినిష్టర్ కాగానే ఒకమాట అన్నారు. మనమంతా ఒకటని కులమత బేధాలు విస్మరించాలని ఈ స్పర్ధలు పనికి రావని చెప్పారు ...... మేము గత్యంతరం లేక నీళ్ళకోసం బావిని ముట్టాం. మేము కావాలని కొట్లాట సృష్టించ లేదు, ఇంకోమాట— పాతికేళ్ళ స్వాతంత్ర్యం తర్వాత, హరిజనుల ఈ స్థితికి ఎవరు కారణమో మీరు ఆలోచించాలి. హరిజనుల ప్రతినిధిగా పరిష్కారం చెప్పమని అడగటం లేదు. ప్రభుత్వ ప్రతినిధిగా చెప్పండి"— తూచి తూచి మాట్లాడాడు.

ప్రసాద్‌కు మంత్రిచెప్పే పరిష్కారం మీద నమ్మకం లేదు. అది పంచాయితి, తప్పని సరి కాబట్టి మాట్లాడాడు,

"నేనొక పరిష్కారం చెపుతాను. మీరంతా వినండి: అందరికీనచ్చే పరిష్కారం హరిజనుల వాడలో రెండు రోజులు లోపున ఒక బావి త్రవ్విస్తాను. ప్రభుత్వగ్రాంటుతో బాలా" అన్నాడు మంత్రి.

ప్రసాద్ లేచి నిల్చున్నాడు

"సీతారామయ్య గారూ! ఈ సంఘర్షణను ఈ విధంగా ఎందుకు పరిష్కరించారో, కొంతమందికి సంతోషం కలుగొచ్చు. కాని నేను అర్థం చేసుకున్నాను. అంతేకాదు. 'చట్టం' దృషిలోని నేరస్తులను అరెస్టు చేయించకుండా ఎందుకు 'రాజీ' అంటూ వచ్చారో నాకుతెలుస్స. మీరు మా ఓట్లతో గెలిచారు, మా ప్రతినిధిగా మాట్లాడటంలేదు, ప్రభుత్వ ప్రతినిధిగా మాట్లాడుతున్నారు. ఈ ప్రభుత్వమెవరిదో నాకు తెలుసు. సంస్కరణల పేరుతో కులాల నెందుకు పెంచుతున్నారో మేం అర్థం చేసుకుంటున్నాం. క్రొత్త బావులు నాలుగు త్రవ్వించండి! మంచిదే. అయితే అందరూ అన్ని బావులతో నీళ్లు తోడాలి అందుకే నా కృషి. నాకుతెలుస్స. సంస్కరణల ద్వారా ఈ సంఘర్షణ అంతం కాదని"— అంటూ లేచి వెళ్లిపోయాడు ప్రసాద్.

## "కథకాదిది..."

వి. ప్రకాశ్

"దండాలు బాంచను"

కళ్ళద్దాలు బల్లపై పెట్టి ఆ మనిషిని నిశితంగా పరిశీలించాడు ఇన్స్పెక్టర్...

"నా పేరు కనకమ్మ బాంచను"

"ఏమిటి సంగతి"

"నేను గాంధీ నగరంలో వుంటను బాంచను- గాంధిబొమ్మ దాటితే నాలుగో యిల్లే మాది బాంచను- ఇండ్లు కిరాయకిచ్చి బతుకుతున్న- మాయింట్లో ఓ పోకిరి యెదవ చేరిండు బాంచను ఇల్లు ఖాళీ సెయ్యమంటే సేత్త లేదు. ఎట్లయినా అన్ని ఖాళీ సేయించుండ్లి బాంచను."

"కొబ్బరి బోండలాగున్నావు నీ మొగుడులేడా?" కనకమ్మపైనుండి దృష్టిని మరల్చకుండానే అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఆడు దేశానికి పోయిండు బాంచను- నెలకోసారి వత్తడు."

కాసేపాగి,

"ఆ పోకిరీయెదవ నాతిరి బాగా తాగొచ్చి నన్ను బలవంతం సేసిండు బాంచను. నేను కేకలెయ్యంగనే అడిగదిలోకి పోయిండు. అదివి ఎంటనే ఖాళీ సేయించుండ్లి బాంచను. సచ్చి మీకడుపున పుడతా" దీనంగా చెప్పింది కనకమ్మ

"సరే వాడిసంగతి నేను చూస్త, నువ్వుపో"